క్లుప్తంగా

నేటి నుంచి హరేరామ నామ సప్తాహం



హరేరామ నామజప యజ్ఞానికి ముస్తాబైన మండపం

మర్కూక్(గజ్వేల్): మూడేళ్లుగా ఆశ్రమంలో శతకోటి హరేరామ నామ జపయజ్ఞం వంద కోట్లు, శ్రీ పాండురంగాశ్రమం 90 వసంతాలు పూర్తి చేసకున్న సందర్భంగా ఆదివారం నుంచి 11వ తేదీ వరకు శ్రీ పాండురంగాశ్రమంలో అఖండ హరేరామ నామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందు కోసం నూతనంగా నిర్మించిన మండపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొంటారన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్, వాసాలమర్రి, దౌలాపూర్, దిల్‌సుఖ్‌నగర్, ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, ఘట్‌కేసర్ భక్త బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్‌లో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలును ఆహారంగా తీసుకోవాలన్నారు. నిత్యం వాకింగ్, యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీ పర్శరాములు, సర్పంచ్ లింగారెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మరుగుదొడ్డి



టేకులతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి పరిధిలోని టేకులతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్డి శిథిలావస్థలో ఉంది. దీంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిరంగ ప్రదేశానికి వెళ్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడంలేదని హెచ్‌ఎం చంద్రమొగిలి ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గది కిటికీలు సరిగా లేకపోవడంతో విషపురుగులు వస్తున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీన మిరుదొడ్డిలో నిర్వహించనున్నట్లు సేంద్రియ వ్యవసాయ జిల్లా కన్వీనర్ సత్తు రాజిరెడ్డి తెలిపారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు స్థానిక సీతారామచంద్ర స్వామి కల్యాణ మండపంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు సాంఘిక శాస్త్రంపై పట్టు సాధించాలన్నారు. ముందు అంతకముందు కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి పరీక్ష బ్రోచర్, ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రసంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుమాదవ్, ఫోరం నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు నంబర్ ఇక్కట్లు

- సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం
- పత్రాలు లేవని ఇంటి నంబరు ఇవ్వని పంచాయతీలు
- ఖాళీ స్థలాలకు మాత్రం ఇంటి నంబర్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పోతారం(ఎస్) గ్రామ పంచాయతీ కార్యాలయం

పేదలు సొంత భూముల్లో ఇళ్లు నిర్మించుకుంటే గ్రామ పంచాయతీ అధికారులు పరిశీలించి ఇంటి నంబర్లు ఇచ్చి పన్నులు వసూలు చేసేవారు. ఈ పంచాయతీలు పేరిట ఆన్‌లైన్ చేయడంతో సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్నా పంచాయతీ అధికారులు ఇంటి నంబరు ఇవ్వకపోవడంతో నానా అవస్థలుపడుతున్నారు. వారసత్వ భూముల్లో కొందరు, సాదా బైనామాల ద్వారా మరి కొందరు ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నా సరైన పత్రాలు లేవని అధికారులు ఇంటి నంబర్లు ఇవ్వమని చెబుతున్నారని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్ ఉమ్మడి మండలంలోని 48 గ్రామ పంచాయతీల్లో ఇంటి నంబర్ల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పల్లె ప్రగతి కార్యక్రమంలో పాత ఇళ్లను కూల్చివేసింది. పంచాయతీ రికార్డులు పారదర్శకంగా ఉండాలని ఇంటి నంబర్లను ఆన్‌లైన్ చేయించింది. ఇదే క్రమంలో కొందరు గ్రామస్థాయి నాయకులు అధికారులు, కారోబార్లను మచ్చిక చేసుకొని ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు వేయించుకున్నట్లు సమాచారం. ఇంటి నంబర్ ఇచ్చిన స్థలంలో ఇల్లు ఉండదు. పంచాయతీ ఇంటి పన్ను డిమాండ్ రిజిష్టర్‌లో కూడా ఆ ఇళ్లకు జీరో డిమాండ్ ఉంటుంది. మోక మీద ఇల్లు ఉండదు, రిజిష్టర్‌లో డిమాండ్ ఉండకపోవడంతో వీటి వలన గ్రామంలో ఇళ్ల సంఖ్య పెరుగుతుంది తప్ప వాటి నుంచి ఎలాంటి ఆదాయం పంచాయతీలకు సమకూరదు. ఏటా మార్చిలో ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులు సమీక్షలు జరిపిన ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు

ప్రభుత్వం పేదల కోసం ఇంటి స్థలాలను పంపిణీ చేస్తే కొందరు మోకాపై లేకపోవడంతో పొరుగు గ్రామాలకు చెందిన వారు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలను పంచాయతీ అధికారులు అడ్డుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా లేనివారు ఇంటి నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించడంలేదంటున్నారు. విలువైన ప్రభుత్వ భూములు కబ్జా అవుతుండటంతో స్థానికులకు ఇంటి స్థలాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోతారం(ఎస్)లో ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డును కూడా కొందరు ఆక్రమించి వెంచర్లు వేశారని పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని, జీరో ఇంటి నంబర్లను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలనీ భూములు కబ్జా



మా ఊరు ఎస్సీ కాలనీకి ప్రభుత్వం భూమి కేటాయించి పేదలకు పట్టాలు ఇచ్చింది. కాలనీ పక్కన దాదాపు రెండు ఎకరాల అసైన్డ్ భూమిని కొందరు ఆక్రమించి ప్రైవేట్ వెంచర్‌లో కలుపుకున్నారు. మా కాలనీకి వచ్చే రోడ్డును కూడా ఆక్రమించి వెంచర్‌లోనే ప్లాట్లు వేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

– చెంచల ఎల్లయ్య, పోతారం(ఎస్)

జీరో డిమాండ్ నంబర్లు తొలగిస్తాం

ప్రభుత్వం గ్రామ పంచాయతీలోని ఇళ్లను ఆన్‌లైన్ చేయాలంటే అప్పుడు ప్రతీ గ్రామంలో ఆన్‌లైన్ చేశాం. పంచాయతీ కార్యదర్శులు సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జీరో డిమాండ్ ఇళ్ల నంబర్లను పరిశీలిస్తాం. అక్కడ ఇళ్లు లేకపోతే రికార్డుల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– సత్యనారాయణ, ఎంపీఓ, హుస్నాబాద్

'గావ్ చలో' విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు పిలుపు ఇచ్చారు. శనివారం హుస్నాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో బీజేపీ పట్టణ వార్డు ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ప్రతీ వార్డుకి ఒక కోఆర్డినేటర్‌ను నియమించామన్నారు. బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ప్రజలు, కుల సంఘాల నాయకులను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, నాయకులు సమ్మయ్య, రాంప్రసాద్, లక్ష్మణ్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కాషాయ జెండాను ఎగురవేయాలి

తొగుట(దుబ్బాక): పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డిగారి విభీషణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన తొగుటలో శనివారం గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడమే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రావు పేట ఎంపీటీసీ కంకణాల నర్సింహులు, బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, గావ్ ఛలో బస్తీ ఛలో మండల కన్వీనర్ ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

ఎంపీపీ గంగాధరి సంధ్య

దౌల్తాబాద్(దుబ్బాక): పదవులు శాశ్వతం కాదని చేసిన పనులే శాశ్వతమని ఎంపీపీ గంగాధరి సంధ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌ల సేవలు మరవలేమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ రణం జ్యోతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వేమ శ్రీను, ఎంపీటీసీలు దేవేందర్, జోడు నవీన్‌కుమార్, వీరమ్మ మల్లేశం, ఆది వనిత, మండల కోఆప్షన్ అహ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ గంగాధరి

అనుమానాస్పద మృతి

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గజ్వేల్ ఏసీపీ రమేష్, సీఐ సైదా ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. జాలిగామ గ్రామానికి చెందిన గుడిసె స్వామి(26)కి భార్య రేణుక, మూడేళ్ల వయసున్న కొడుకున్నాడు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన స్వామి 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. మృతదేహం సమీపంలో పురుగుల మందు సీసా, మద్యం బాటిల్ ఉండటంతో అవి తాగి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వామి(ఫైల్)

మైనంపల్లిని కలిసిన సిద్దిపేట కాంగ్రెస్ నేతలు



మైనంపల్లి హనుమంతరావుతో సిద్దిపేట కాంగ్రెస్ నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును శనివారం హైదరాబాద్‌లో కలిసినట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమాం తెలిపారు. ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్న సిద్దిపేట నియోజక వర్గ కార్యకర్తల సమావేశానికి మైనంపల్లి హనుమంతరావు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలనుద్దేశించి పలు సూచనలు చేస్తారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, నాయకులు గయాజుద్దీన్, గ్యాదరి మధు, మజార్ మాలిక్, సోహైల్, బొమ్మల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 2024లో అందించే అవార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సెలక్షన్ కమిటీ ఇన్‌చార్జి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సేవలను, సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి బహుజన సాహిత్య అకాడమి వారు ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, కళాకారులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి తిరుపతిలో జరిగే జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దళిత సంఘర్షణ సమితి జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'కి మార్చాలి

ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాజు



మాట్లాడుతున్న బాల్‌రాజు

మిరుదొడ్డి(దుబ్బాక): ముదిరాజ్‌లను బీసీ ×డి× నుండి 'ఏ' లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో శనివారం ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముదిరాజ్‌లను బీసీ 'డి' నుండి ×ఏ×లోకి మార్చారన్నారు. అనంతరం మళ్లీ బీసీ ×డి×లోకి మార్చారని అసహనం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించి ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ముదిరాజ్‌ల జనాభాను అనుసరించి అన్ని రాజకీయ పార్టీలు నాలుగు ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు. ముదిరాజ్‌లను ప్రతీ ఎన్నికల్లో కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు ఐల విద్యాసాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'లో భాగస్వామి కావాలి



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు పుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి

గజ్వేల్‌రూరల్: తొలిమెట్టు పథకంలో ప్రతీ విద్యార్థి భాగస్వామై చదువులో వెనుకబడిన వారికి బోధన చేయాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'పిల్లల కోసం తొలిమెట్టు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సంబంధించిన పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల కోసం తొలిమెట్టులో భాగంగా ప్రతీ శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాఠశాలలకు వెళ్తూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు బోధించడం అభినందనీయమన్నారు. తొలిమెట్టులో ఉత్సాహంగా పాల్గొంటున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆ పథకం 1, 2 అధికారులు కస్తూరిబాయ్, డాక్టర్ జయరాజు అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య, పూజిత, నందిని, సుస్మిత, లేఖ, మానస, సంధ్యారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్



మాట్లాడుతున్న రవీందర్

కొమురవెల్లి(సిద్దిపేట): మత్స్యకార్మికుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నట్లు తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ (ఎస్.ఎఫ్.ఎసీ), కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాల పాలకవర్గ సభ్యులకు సంఘం పనితీరు, నిర్వహణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, తేలు ఇస్తారి, గొల్లపల్లి బాలయ్య, సార్ల కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య, మేడికుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పవిత్రతను కాపాడండి



మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ పవిత్రతను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నకు సేవచేసే పవిత్రమైన చైర్మన్ హోదాలో ఉండి ఆలయ పరిసరాలలో మద్యం తాగి ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తున్నారన్నారు. శుక్రవారం రాత్రి తన అనుచరులతో కలసి మద్యం తాగారని, మద్యం మత్తులో గొడవపడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగా కృష్ణారెడ్డి, మండల నాయకులు తాడూరి మల్లేశం, బక్కెల్లి బాల కిషన్, వుల్లంపల్లి సాయిలు, నీల భిక్షపతి, ఆరుట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

సిద్దిపేటకమాన్: పొన్నాల చౌరస్తా వద్ద మద్యం దుకాణాన్ని తొలగించాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పొన్నాల దగ్గర ఉన్న వైన్ షాపునకు అనుమతులు లేకున్నా రాజీవ్ రహదారికి సమీపంలో ఉండటం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇప్పటికే నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని, వైన్ షాపును తొలగించాలన్నారు.

ఘనంగా స్వయం పాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా జ్యోతిర్మయి, ఎంఈఓగా రిత్విక్, హెచ్‌ఎంగా రక్షిత, టీచర్లుగా పవన్, కార్తీక్, శ్రీనివాస్, ఫర్హానా, శ్రీవల్లి, మధులత, రేణుక, మనోజ్‌లు విధులు నిర్వహించారు. విద్యార్థులకు హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు ఉపేందర్ బహుమతులు అందజేశారు.

సోషల్ టాలెంట్ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ

మర్కూక్(గజ్వేల్): జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ పరీక్షలో మండలంలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ద్వితీయ బహుమతి సాధించింది. శనివారం సిద్దిపేట జిల్లా ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ గ్రామీణ ప్రతిష్ట, తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో తెలుగు మీడియంలో పాములపర్తి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సాయిప్రియ ద్వితీయ బహుమతి సాధిచింది.

సంక్షిప్త వార్తలు

◆ ఇసుక అక్రమ తరలింపు

వర్గల్(గజ్వేల్): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. శనివారం వర్గల్ కమాన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా మంచిర్యాల నుంచి ఇసుకలోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న లారీని తనిఖీ చేశారు. సుమారు 35 టన్నుల ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి డ్రైవర్‌పై కేసు నమోదుచేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

◆ ఇద్దరిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): తాగిన మత్తులో ఓ మహిళ ఇంటిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జనగామ గ్రామానికి చెందిన ఎగ్గిడి రాజవ్వ ఇంటిపై అదే గ్రామానికి చెందిన హుస్నాబాద్ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, ఎగ్గిడి రమేష్ తాగిన మత్తులో అసభ్యంగా తిడుతూ ఇంటి తలుపులు పగలగొట్టారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ నివారణ చర్యలు తీసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): వరిలో మొగి పురుగు ఆశిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి అఖిల్ అన్నారు. శనివారం మండలంలోని లద్నూర్, మర్మాముల, సలాక్‌పూర్ రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించి మొగి పురుగు ఆశించినట్లు గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటువేసిన 15 రోజుల్లో ఎకరానికి 8 కిలోల కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు లేదా క్లోరంట్రినిలిప్రుల్ గుళికలు నాలుగు కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలన్నారు. యూరియాను మోతాదుకు మించి వినియోగిస్తే వరిలో అగ్గి తెగులు సోకుతుందన్నారు.

◆ తండ్రి జ్ఞాపకార్థం సీసీ రోడ్డు నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలోని సంజీవరాయి గుట్టపై సమ్మక్క సారలమ్మ జాతర ఏటా వైభవంగా నిర్వహిస్తారు. గుట్టకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. శనివారం గోవర్ధనగిరికి చెందిన సదానందచారి తన తండ్రి వద్ల కందారపు మహదేవ్ చారి జ్ఞాపకార్థం పేరిట సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాడు. సదానందచారిని గ్రామస్తులు అభినందించారు.

◆ డ్రైనేజీ పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 1వ వార్డులో పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, చెవిటి లింగం, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, కో ఆప్షన్ సభ్యులు అంజనీదేవి, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ గ్రంథాలయాలు మేధాశక్తిని పెంచుతాయి

కొండపాక(గజ్వేల్): గ్రంథాలయాలు మేధాశక్తిని పెంచుతాయని పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్ అన్నారు. కుకునూరుపల్లిలోని గ్రంథాలయానికి రూ.10 వేల విలువ చేసే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను శనివారం మాజీ సర్పంచ్ జయంతితో కలిసి అందజేశారు. గ్రంథాలయాల నిర్వహణకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, నాయకులు సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆ ఆరోపణల్లో నిజం లేదు

మల్లన్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ఆలయ పరిసరాల్లో మద్యం సేవించినట్లు నిరూపిస్తే దేనికైన సిద్ధమని కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. సీపీఎం నాయకుల ఆరోపణలపై శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మద్యం సేవించినట్లు తడి బట్టలతో సీపీఎం నాయకులు ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. నిజమని తేలితే క్షమాపణ చెబుతానన్నారు.

◆ సీసీ కెమెరాలపై అవగాహన

హుస్నాబాద్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో శనివారం రాత్రి ఎస్ఐ తోట మహేష్ సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు రవి, బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990